# కడవరకూ... తోడొచ్చే బాధ

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు, సెల్ నెం : 9393981918 ఓ మంచికథ

దూరంగా కూర్చున్న మా అబ్బాయి వంక చూశాను. ముభావంగా తనదైన ఓ లోకంలో వున్నాడు వాడు. వాడిని చూస్తే కడుపుతరుక్కు పోయింది. మనసంతా వికలమైపోయింది. మస్తిష్కంలోని జ్ఞాపకాల పొరల్ని తొలగించుకుంటూ గతానికి ప్రయాణం చేశాను. పెళ్ళై ఏడేళ్లైంది పిల్లల్లేరు. అమ్మా నాన్న ఒత్తిడిమీద గుళ్ళు గోపురాలు.. స్నేహితుల ప్రోద్భలంతో అప్పుడప్పుడే ఊపందుకుంటున్న సంతాన సాఫల్య కేంద్రాలు పిచ్చపిచ్చగా తిరిగేశాము.

దేవుడు అనుజ్ఞ ఇవ్వందే కాయ ఎలా కాస్తుంది? ఇహ విసిగి వేసారి తను గొడ్డుదని.. నేను మగాడ్ని కాదని మా మీద చుట్టాలు.. పక్కాలు ముద్రవేసేయ్యబోయేంతలో ఓ అద్భుతం జరిగింది. నా భార్య రుక్మిణి గర్భవతైంది! మా జీవితంలో ఓ గొప్ప వసంతం! ఆ తొమ్మిది నెలలు మాకెంతో అపురూపం..జీవిత పుస్తకంలో సువర్ణ పుటలు, పండంటి పాప పుట్టింది. పాప పిల్లల్లేని మాకు పాప పుట్టడం గొప్ప అదృష్టమైనా చుట్టూ వున్న వాళ్ళు 'అరే! బాబు పుడితే ఎంత బావుండేది? వంశాన్ని నిలబెట్టేవాడు... పున్నామ నరకం తప్పించేవాడు..


వృద్ధాప్యంలో ఆదుకునే వాడు..పుట్టుంటే ఆ సంతోషమే వేరు. పాపం ఏ ముహూర్తంలో మీ ఇద్దరికీ పెళ్ళయిందో కాని..' మాటలు మనసుని తూట్లు చేశాయి. మా ఆనందాన్ని ఆవిరి చేశాయి. మళ్ళీ గుళ్ళూ గోపురాలు.. సంతాన సాఫల్య కేంద్రాలు మామూలే!

ఈ సారి ఎక్కువ ఎదురు చూడాల్సిన అవసరం పడలేదు. రుక్మిణి గర్భవతైంది. మా ఆనందం ఆర్ణవమైంది. కాని మనసులో 'ఒక వేళ మళ్ళీ అమ్మాయే పుడితే' అనే ఓ శంక. పోని స్కానింగ్ చేయించి తెలుసుకుందామా? అంటే గవర్నమెంట్ రూల్ ప్రకారం కుదరదన్నారు. మా ఆవిడ సంగతేమో కాని నాకు మాత్రం బెంగగానే వుంది. కారణం నా కొచ్చేది జానాబెత్తెడు జీతం.. దాంతో ఒక్క కూతుర్ని పెంచి పెద్ద చేసి కట్న కానుకలతో ఓ అయ్య చేతిలో పెట్టడమే గగనం. అలాంటిది మరో నలుసు పుడితే... అదీ ఆడపిల్లైతే..అమ్మో! ఇంకేమన్నా వుందా? అలా పావు వంతు సంతోషంతో ముప్పావు వంతు బాధతో తొమ్మిది నెలలు పూర్తయ్యాక పండంటి బాబుకి జన్మనిచ్చింది. ఆహా! ఏమి ఆనందం.. అందరికీ స్వీట్లు పంచాను. దురదృష్టవంతుడు ఓవర్నైట్లో అదృష్టవంతుడైనంత సంతోషం. మొత్తానికి రోజులు సాఫీగా.. నల్లేరుమీద బండి నడకలా గడుస్తున్నాయి.

అంతా సుఖంగా శాంతిగా సాగుతుంటే ఇంకేముంటుంది? విధి కన్ను పడకపోతే వింతేముంటుంది? అల్లారుముద్దుగా పెరుగుతున్న బాబు పెరిగి పెద్దవుతున్న కొద్దీ మాకో విషయం అవగతమవుతోంది. వాడు ఎదుగుతున్నాడేగాని మెదడు ఎదగట్లేదు. నిజమో కాదో అనే సందిగ్ధావస్థలో నిజం కాకూడదన్న కోరికతో డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళాము. దిగింది...పదునైన కత్తి దిగింది.. వాడు మానసికంగా ఎదగలేడు అన్న వాస్తవపు కత్తి దిగింది. నా సంగతి సరే, పాపం రుక్మిణి గుండెలవిసేలా ఏడ్చింది. తల్లి కదా తల్లడిల్లిపోయింది.

పెరిగి పెద్దవుతున్నాడు. బారసాల..నామకరణం లాంటివి చేశాము, కాని అక్షరాభ్యాసం చేయించలేదు. మెదడు ఎదగట్లేదంటే చదువెలా? పాపం వాడిని ఈ జన్మకి సరస్వతీ దేవి కరుణించలేద. వాడి ఈడు పిల్లలు స్కూలుకి వెడుతుంటే పాపం వాడేమో అలా శూన్యభావ స్థితిలో! గుండెలు పిండేసే బాధ.

మా తృప్తికోసం మానసిక వికలాంగుల పాఠశాలలో వేశాము. అక్కడి పిల్లలు కొంత మంది పుస్తకాలు.. పెన్నులు.. ఆట వస్తువులూ పట్టుకుంటూ అనలేక అనలేక ఒక్కోపదం అంటుంటే ఆ తల్లిదండ్రుల ఆనందం చెలియలికట్ట దాటుతుండేది. వాళ్ళ పిల్లలు ఐఏఎస్ ఐపిఎస్‌లు అయినంత సంబరం. కాని నాకాకాస్త అదృష్టం కూడా లేదు. స్కూల్లో చేర్పించినప్పటికి ఇప్పటికి వాడిలో ఇసుమంత మార్పు లేదు. ప్రిన్సిపల్ మమ్మల్ని పిలిచి వాడిలో ఏ మాత్రం పురోగతీ





కనిపించడంలేదని. స్కూలుకి పంపించడం ఓ ఉపయోగం లేని పనని చెప్పింది. నిజానికి మా ఇంటికి స్కూల్ దాదాపు నాలుగు కిలోమీటర్లు. అంత దూరం వెళ్ళి దింపి తీసుకురావడం ఇబ్బందే! అందువల్ల మారు మాట్లాడక మానిపించేశాము.

ఒకసారి మేము మా ఊళ్ళో జరుగుతున్న జాతర చూడ్డానికి వెళ్ళాం. ఎంత జాగ్రత్తగా వున్నా వాడు తప్పిపోయాడు. కాసేపు వెతికాము. దొరకలేదు. రుక్మిణి బాధ వర్ణనాతీతం. చీకటిపడింది. ఇంటికొచ్చాము. పక్కింటి వాళ్ళకి విషయం తెలిసి పరామర్శించడానికి వచ్చారు. "నిజం చెబుతున్నా, కాస్త చేదుగా వున్నా వినండి. వాడి వల్ల మీకెటువంటి ఉపయోగంలేదు. అనుక్షణం కంటికి రెప్పలా కాపాడుకున్నా వాడివల్ల ఏమన్నా ప్రయోజనం వుంటుందా? మీకు వాడు కన్న కొడుకే కాదనం కాని ప్రాక్టికల్‌గా ఆలోచించండి. ఓ శుభకార్యాలకి వెళ్ళడానికి లేదు. సినిమాలకి, షికార్లకి వెళ్ళడానికి లేదు. మీకు మాత్రం జీవితం అక్కర్లేదా? ఎంతసేపూ వాడితోడిదే ప్రపంచమా? ఒక ఆడపిల్ల వుంది బాగా ఆలోచించండి. వాడిని ఏ పిచ్చాసుపత్రిలోనో జాయిన్ చేస్తారు. అలాంటి వాళ్ళ బాగోగులు ప్రభుత్వ సహాయంతో ఆసుపత్రులే



**భార్య :** ఏమండి! మీరు పేకాట, గుఱ్ఱపు పందాలు ఆడకుండా వుండలేరా?

**భర్త :** నీవు టి.వి. సీరియల్స్ చూడకుండా వుండగలవా?

**భార్య :** వుండలేను

**భర్త :** నేను కూడా అంతే!

**- షేక్ అస్లాం షరీఫ్**

చూసుకుంటాయి. మీరిక నిశ్చింతంగా వుండండి అన్నారు.

మాకేం మాట్లాడాలో అర్థం కాలేదు. వాళ్ళు చెప్పినంత సులువా వాడిని మర్చిపోవడం? వాడు మానసిక వికలాంగుడే కాదనం కాని రక్తం పంచుకుపుట్టినవాడు. వాడివల్ల ఇబ్బందులెదురైనంత మాత్రాన వాడిని ఒదుల్చుకోవడమేనా? అదేనా మానవత్వం? చెట్టుకి కాచే అన్ని పళ్ళు సంపూర్ణంగా వుండకపోవచ్చు. అంత మాత్రంచేత చెట్టు వాటిని దులిపేసుకుంటుందా? ఆ రాత్రి మాకు నరకమే! వాడు లేకపోవడమన్నది మాకు లోటుగానే అనిపించింది. అదేమిటో?

మరుసటి రోజు తెల్లరంగానే వాడిని వెదకటానికి బయల్దేరాను. అంతలో ఒక పెద్దాయన వాడిని తీసుకుని మా ఇంటికి వచ్చాడు. ఆయన్ని మేమెప్పుడు చూసిన జ్ఞాపకం లేదు. లాల్చిపైజమాలో, తెల్లటి జుత్తు, ఒత్తైన గడ్డంతో నుదుటన సిందూరంతో దైవత్వం గోచరిస్తూ కనిపించాడు. "ఇదిగో మీ పిల్లాడు...నిన్నరాత్రి జాతరలో కనిపించాడు. రాత్రే వచ్చి అప్పజెబుదామనుకున్నాను కాని బాగా అలసిపోయి వుండటంచేత రాలేకపోయాను. పిల్లలు తప్పిపోతే చాలా కష్టం ఇలాంటి పిల్లలైతే మరీను. పిల్లాడు ఏ వికారంతో జన్మించినా తల్లిదండ్రులకి సంతానమే! దేవుడి ప్రసాదమే! జాగ్రత్తగా చూసుకోండి" అని అప్పగించి వెళ్లిపోయాడు. మా వాడి కళ్ళలో మెరుపు! అంటే.. అంటే వాడు కుటుంబ సభ్యులని గుర్తుపడతాడన్నమాట.. అనుకుని ఆ క్షణాన్ని అపురూపంగా హృదయంలో భద్రపరచుకున్నాము.

'వాడు మా పిల్లాడని ఎలా తెలుసు? మీరెక్కడుంటారని?' అడిగేలోపు ఆయన వెళ్ళిపోయాడు.

మా అదృష్టమేమిటంటే మా వాడు ఎవరిని కొట్టడు...తిట్టడు. వాడి మూలంగా బయటి వ్యక్తుల్నించి ఏ రకమైన ఫిర్యాదులు వుండవు కాని వాడిని చూడగానే కొత్తవాళ్లు భయపడి పోవడం సహజం. అంతేగాక వాళ్ళ జాలిని వ్యక్తం చేయడం వాళ్ళ ముందు శోకతప్త హృదయంతో మేము నుంచోడం అదే... అదే మా గుండెల్ని రంపంలా కోసేది. ఎవరికి తోచిన సలహా వాళ్ళిచ్చేవారు.

పెళ్ళిళ్ళకి.. బయటి ఫంక్షన్లకి పోవడం దాదాపుగా మానుకున్నాము. ఎంతో ముఖ్యమైనదైతే తనో నేనో వెళతాం. మరొకరం బాబుకి కాపలా వుంటాం. వాడికిలాగా మాకు ఇల్లే ప్రపంచమైపోయింది.

××××

నెమ్మదిగా లేచి వాడి దగ్గరకి వెళ్ళాను. వాడిలో ఏ విధమైన భావమూ లేదు. నెమ్మదిగా వాడిని భోజనానికి ఇంట్లోకి తీసుకెళ్ళాను.

అందరం భోజనానికి కూర్చున్నాము.

మా అమ్మాయి వంక చూశాను. ఈ మధ్యే డిగ్రీ పూర్తి చేసింది. తనకి పెళ్ళి సంబంధాలు వస్తున్నాయి.

"నాన్నా! మీరు పెద్దవాళ్ళవుతున్నారు. తమ్ముడిని ఎంతకాలం చూసుకుంటారు? నాకు పెళ్ళిచేస్తే ఆ వచ్చే అతను తమ్ముడిని చూడడానికి ఒప్పుకోవచ్చు. ఒప్పుకోక పోవచ్చు. అప్పుడు పాపం వాడి పరిస్థితి ఏమిటి? అందుకే నేనో నిర్ణయానికి వచ్చాను. నాతో పాటు వాడినీ అంగీకరించే అతనితోటే నా పెళ్ళి .. లేదంటే వాడితో పాటే నేనూను.." అంది ఆరిందాలా.

మా హృదయం ద్రవించిపోయింది. తమ్ముడి మీద ప్రేమతో వాడి బాధ్యత తన చిన్ని భుజాల మీద వేసుకుంటాననంటోంది. మా శిక్ష తను భరిస్తాననంటోంది. తన సుఖం.. సంతోషం.. ఒదులుకుంటాననంటోంది.

భగవంతుడా? ఏమిటిది? అన్నీ సవ్యంగా వున్నవాళ్ళే భారంగా కాలం గడుపుతున్న పాపపు రోజులివి. ఇలాంటి మానసిక దౌర్భాగ్యులని ఎవరు పట్టించుకుంటారు? ఈ సమాజంలో వాళ్ళు పనికిరాని వాళ్ళే కాని వాళ్ళూ జీవులే! వాళ్ళ కడుపుకి ఆకలేస్తుంది. వాళ్ళ మనసుకి బాధేస్తుంది. వాళ్ళని చూస్తూ క్షణ క్షణానికి అప్పులైన వాళ్ళు కుమిలిపోవడంతప్ప ఇంకేమీ చెయ్యలేమా? కాలం గాయాలని మాన్పుతుందంటారే! కాని ఇదెప్పటికి వుండే గుండెలమీది గాయం. భరించక తప్పని బాధ. ఒదిలించుకోవాలనిపించని బాధ! మాకు వృద్ధాప్యంలో తోడు నీడగా వుండాల్సిన వాడికి మేమే తోడూ నీడా! అన్ని బాధ్యతలు తీరిపోయాయని పెద్దతనాన మనశ్శాంతిగా వుండాల్సిన తరుణంలో కడవరకూ తోడొచ్చే బాధ ఇది.

కళ్ళ నుండి నీళ్ళు జలజలా రాలాయి.. వాడు పుట్టినప్పటి నుండి ఇది ఎన్నోసారో..లెక్కలేదు ఈ జన్మకింతే

**(కన్నవాళ్ళు మమకారాన్ని చంపుకోలేక. తోడబుట్టినవాళ్ళు బలహీనతని అర్థం చేసుకుంటూ.. సుఖాలని త్యాగం చేసి.. మానసిక వైకల్య పిల్లల్ని అనుక్షణం కంటికి రెప్పలా కాపాడుకుంటున్న దేవతాస్వరూపులైన వాళ్ళందరికీ ఈ కథ అంకితం)**

